


మెగా డీఎస్సీ కోసం ఎదురుచూపు

నేడు సంతకం చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు?

- విద్యా శాఖ లెక్క ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఖాళీలు 99 మాత్రమే
- వైసీపీ తీసుకున్న తప్పుడు నిర్ణయాలే కారణం
- జీవో 117 రద్దు చేస్తే భారీగా పోస్టులు



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు గురువారం మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేయనున్నారు. ఆ తరువాత డీఎస్సీ నియామకాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనున్నది. ఇందుకోసం నిరుద్యోగులు ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యా శాఖ వద్ద ఉన్న వివరాల ప్రకారం 14 సెకండరీ గ్రేడ్, 85 స్కూల్ అసిస్టెంట్...మొత్తం 99 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలే ఇందుకు కారణం. ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం, ఒకటి, రెండు తరగతులకు సంబంధించి టీచర్ల సంఖ్యను తగ్గించడం, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని పెంచడం వంటి నిర్ణయాలు తీసుకుంటూ జీవో 117 ఇచ్చింది. ఒకటి, రెండు తరగతులున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 20 కంటే తక్కువ ఉన్నచోట ఒక్కరే టీచర్‌ను ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అలాగే 3,4,5 తరగతులకు టీచరు, విద్యార్థుల నిష్పత్తి 1:30, 6,7,8 తరగతులకు 1:35, 9, 10 తరగతులకు 1:40 నిష్పత్తిని అమలుచేసింది. మూడు నుంచి ఎనిమిది తరగతుల వరకు ఒక సెక్షన్‌లో 53 మంది, 9,10 తరగతులకు 61 మంది కంటే ఎక్కువ ఉంటేనే రెండో పోస్టు మంజూరుచేశారు. ఉన్నత పాఠశాలల్లో 98 మంది కంటే విద్యార్థులు తక్కువగా ఉంటే ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసింది. ఈ ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియ అమలుచేయడంతో భారీగా టీచర్ పోస్టులు రద్దయ్యాయి. విశాఖ నగర పరిసరాల్లో గల ఉన్నత పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థులున్నా 117 జీవో కారణంగా టీచర్ పోస్టుల సంఖ్య పెరగలేదు. సాధారణంగా ఏటా టీచర్లు పదవీ విరమణ చేయడం, పదోన్నతుల నేపథ్యంలో ఖాళీలు ఏర్పడాల్సి ఉంది. అయితే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 2022లో 62కు పెంచడంతో ఈ ఏడాది జనవరి 31 తరువాత పదవీ విరమణలు ప్రారంభమయ్యాయి. ఈ నెలలో ఉమ్మడి జిల్లాలో 60 మంది టీచర్లు పదవీ విరమణ చేస్తారని అంచనా. ఈ ఏడాది చివరికల్లా రెండు, మూడు వందల మంది టీచర్లు రిటైర్ కానున్నారు. పాఠశాలల విలీనం, సెక్షన్‌లలో టీచర్, విద్యార్థి నిష్పత్తి తగ్గింపు వంటి చర్యలకు సంబంధించిన జీవో 117 రద్దు చేస్తేనే ఉమ్మడి జిల్లాలో భారీగా ఉపాధ్యాయ పోస్టులు అవసరమవుతాయని టీచర్లు అంచనా వేస్తున్నారు. ఇంకా పదవీ విరమణ, పదోన్నతుల వల్ల ఖాళీలు ఏర్పడబోతున్నాయని, దీనిపై విద్యాశాఖ కసరత్తు చేస్తోందని అంటున్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

- అందని పాఠ్యపుస్తకాలు
- నేటి నుంచి స్టూడెంట్ కిట్లు పంపిణీ

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం బుధవారం నుంచి పాఠశాలలు తెరవాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణం స్వీకార కార్యక్రమం ఉండడంతో గురువారానికి వాయిదా వేశారు. జిల్లాలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకోగా, ఒకటి నుంచి ఏడో తరగతి వరకు పుస్తకాలు 80 శాతం జిల్లాకు వచ్చాయి. ఇక గురువారం నుంచి స్టూడెంట్లకు కిట్లు (విద్యా కానుక పేరు మార్చారు) పంపిణీ చేయాలని తాజాగా ఆదేశించారు. జిల్లాలో సుమారు 90 వేల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనం గురువారం నుంచే అందించేందుకు ఏర్పాట్లుచేశారు.

పాఠశాలలు సిద్ధం చేశాం: చంద్రకళ, డీఈవో, విశాఖపట్నం

గురువారం నుంచి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునః ప్రారంభిస్తున్నాం. ఇందుకు పాఠశాలలు సిద్ధం చేశాం. సిలబస్ బోధనకు ప్రణాళిక రూపకల్పన చేసి బుధవారమే ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాం.

అనిత అనే నేను..

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వంగలపూడి అనిత



సేవే పరమావధిగా పనిచేస్తా!

- విజనరీ లీడర్ చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కడం పూర్వజన్మ సుకృతం
- మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా పనిచేసి, రాష్ట్రాభివృద్ధిలో తనవంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. బుధవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. చంద్రబాబు కల్పించిన అవకాశానికి జన్మజన్మలూ రుణపడి ఉంటానన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు అపూర్వ విజయాన్ని అందించారని, మంత్రిగా వారి సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మంత్రివర్గంలో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు చాన్స్

- ఉపాధ్యాయురాలి నుంచి మంత్రి స్థాయికి...
- 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక
- ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో రెండోసారి విజయం



మంత్రి వంగలపూడి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

విశాఖపట్నం/పాయకరావుపేట, జూన్ 12: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కేవలం ఒక్కరికి మాత్రమే రాష్ట్ర కేబినెట్‌లో స్థానం దక్కింది. పాయకరావుపేట నుంచి టీడీపీ తరపున రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనితను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆమె తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైసీపీ అక్రమాలు, అన్యాయాలపై చేసిన పోరాటానికి ఫలితంగా మంత్రి పదవి లభించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక వర్గం కూడా కొంతవరకు దోహదపడింది. చక్కటి వాక్చాతుర్యం, ఉన్నత విద్య, ధైర్యంగా మాట్లాడగల నేర్పు...ఇవన్నీ ఆమెకు ప్లస్ పాయింట్లుగా మారాయి.

ఇదీ ప్రస్థానం

విద్యావంతురాలైన వంగలపూడి అనిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో ఉద్యోగానికి రాజీనామా చేసి, 2013లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోమారు అక్కడి నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు.

కుటుంబ నేపథ్యం...

ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరంలో వంగలపూడి అప్పారావు, స్నేహలత దంపతులకు 1979 మార్చి 24న అనిత జన్మించారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు సబ్బవరంలో చదువుకున్న ఆమె డిగ్రీ అనకాపల్లి ... మిగతా IIIవ పేజీలో

సీనియర్ల ఆశలు అడియాసలు

- ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అరకు, పాడేరు మినహాయిస్తే మిగిలిన 13 స్థానాలను కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. జిల్లాకు మూడు, కనీసం రెండు పదవులు అయినా వస్తాయని అంతా భావించారు. కానీ ఒక్కటి మాత్రం దక్కింది. కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో టీడీపీలో సీనియర్ నాయకులు చాలామంది ఉన్నారు. వారిలో అయ్యన్న ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఎన్‌టీ రామారావు హయాం నుంచి కూడా ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తూ వచ్చారు. ఈసారి ఆ అవకాశం రాలేదు. విశాఖ జిల్లాను తీసుకుంటే గంటా శ్రీనివాసరావు 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. మొదటిసారి అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తరువాత వరుసగా అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. ఈసారి భీమిలి నుంచి రెండోసారి పోటీ చేసి 92 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. మంత్రిగా ఛాన్స్ దక్కుతుందనుకున్నారు. కానీ రాలేదు. అదే విధంగా జనసేన పార్టీ నుంచి అనకాపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొణతాల రామకృష్ణ వైఎస్ రాజశేఖరరెడ్డి టీమ్‌లో వాణిజ్య పన్నుల శాఖా మంత్రిగా చేశారు. ఇంకా పెతకంశెట్టి గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబులు నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గాజువాక నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ (95 వేల ఓట్లు)తో విజయం సాధించారు. యాదవ సామాజికవర్గం నుంచి ఆయన అవకాశం వస్తుందని ప్రచారం జరిగింది. అదే కోటాలో ఇద్దరిని తీసుకోవడంతో పల్లాకు ఛాన్స్ రాలేదు. మలి విడతలో సీనియర్లకు అవకాశం లభించవచ్చునని వారి అనుచర వర్గాలు ఆశిస్తున్నాయి.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీపై విచారణ

2019 నుంచి 2023 మధ్య చేపట్టిన నియామకాలపై ఓ అధికారి ఫిర్యాదు

- విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీకి బాధ్యత

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో 2019 నుంచి 2023 మధ్య కాలంలో అనేక పోస్టులను అడ్డగోలుగా భర్తీ చేశారంటూ కొద్దిరోజుల కిందట రాష్ట్ర ప్రభుత్వానికి ఒక అధికారి ఫిర్యాదు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయం కేంద్రంగా నేషనల్ హెల్త్ మిషన్‌తోపాటు వివిధ ప్రోగ్రామ్‌లలో భాగంగా చేపట్టిన సుమారు రెండు వేలకు పైగా పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ సదరు ఉద్యోగి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణకు అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీని ప్రభుత్వం నియమించింది. ఆయన బుధవారం విచారణ నిర్వహించారు. అనకాపల్లి ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ విచారణకు గతంలో విశాఖ ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి మరో చోటకు బదిలీపై వెళ్లిన అధికారి, ప్రస్తుతం ఆరోగ్య శాఖ కార్యాలయంలోనే పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, మరో కింది స్థాయి ఉద్యోగి హాజరైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన సమాచారాన్ని, ఆయా పోస్టుల భర్తీ సందర్భంగా అనుసరించిన రోస్టర్, ఇతర వివరాలను విచారణ అధికారి అడిగి తెలుసుకున్నారు. అయితే, ఫిర్యాదు చేసిన ఉద్యోగి విచారణకు హాజరుకాలేదని తెలిసింది. దీంతో మరోసారి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఫిర్యాదులో అనేక అంశాలు పేర్కొన్నప్పటికీ..వాటికి సంబంధించిన ఆధారాలు సమర్పించాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసిన అధికారికి విచారణ అధికారి సమాచారం అందజేశారు. ఆయా వివరాలను సమర్పిస్తే మరింత లోతుగా విచారణ చేసేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, ఆ తరువాతే వివరాలు వెల్లడిస్తామని విచారణ అధికారి, అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు.

ఆరోపణలు ఎన్నో..

వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్‌తోపాటు ఇతర పోస్టులు భర్తీ చేసినప్పుడు అనేక ఆరోపణలు వచ్చాయి. వీటిపై అప్పట్లోనే పెద్దఎత్తున దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రెండు, మూడుసార్లు నోటిఫికేషన్లు రద్దు చేసి మళ్లీ తిరిగి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ పోస్టుల భర్తీ వ్యవహారంపై ఫిర్యాదులు రావడం గమనార్హం. ఈ విచారణలో ఎటువంటి విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాల్సి ఉంది.



నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్‌పై చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తూ పూలు చల్లుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

కూటమి కార్యకర్తల సంబరాలు

- ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షిస్తూ హోరెత్తులు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించేందుకు తూర్పు నియోజకవర్గ కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఉదయం 11.30 గంటలకు వేదికపైకి దేశ ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రాగానే ఒక్కసారిగా చప్పట్లతో తమ సంతోషాన్ని తెలిపారు. ఆ తరువాత జనగణమణ గీతం ఆలపించడంతో గౌరవ సూచకంగా అందరూ లేచి నిల్చునున్నారు. అనంతరం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పుడు చప్పట్లతో ఆనందం వ్యక్తంచేశారు. కొందరు స్క్రీన్‌పై పూలు చల్లారు. మహిళలు హోరతులిచ్చారు. తదుపరి పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఈలలు, నినాదాలతో హాలు దద్దరిల్లిపోయింది. మహిళలు స్క్రీన్ వద్ద హారతులిచ్చారు. అదేవిధంగా లోకేశ్ మంత్రిగా ప్రమాణం చేసే సమయంలోనూ పూలు చల్లి, హారతులిచ్చి తమ సంతోషం వ్యక్తంచేశారు. కార్పొరేటర్లు గొలగాని మంగవేణి, నొల్లి నూకరత్నం, ఇంకా పోలారావు, బైరెడ్డి పోతనరెడ్డి, కాళ్ల శంకర్, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలెక్టరేట్‌లో ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రచారం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఇతర అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ అత్యుత్సాహం!

- ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా కైలాసగిరిపై వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన గ్లో సైన్ బోర్డు ప్రారంభం
- ఆధునికీకరించిన వీఎంఆర్‌డీఏ కమిషనర్ బంగ్లా కూడా ప్రారంభం



కైలాసగిరిపై వ్యూపాయింట్ ప్రారంభిస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం అవుతోంది. విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఎ.మల్లికార్జున బాధ్యతలు చేపట్టి మూడేళ్లు గడిచింది. కడప జిల్లాకు చెందిన ఆయన...వైసీపీ పెద్దల కనుసన్నల్లో పనిచేస్తూ వారికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలుగుదేశం, జనసేనల నాయకులు పలు సందర్భాల్లో ఆరోపిస్తూ వచ్చారు. త్వరలో చేపట్టనున్న బదిలీల ఆయన పేరు ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఇటువంటి తరుణంలో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా, వారికి మాట మాత్రం చెప్పకుండా వీఎంఆర్‌డీఏ నిధులతో చేపట్టిన పలు ప్రాజెక్టులను బుధవారం సాయంత్రం కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించేశారు. అందులో ఒకటి కైలాసగిరి వ్యూ పాయింట్. శివపార్వతుల విగ్రహానికి కుడివైపున కిందన చక్కటి వ్యూ పాయింట్ ఉంది. అక్కడి నుంచి సముద్రం కనిపిస్తుంది. ఆ స్థానంలో 'ఐ లవ్ కైలాసగిరి' అంటూ గ్లోసైన్ బోర్డు పెట్టారు. దానికి సుమారు రూ.14 లక్షలు వెచ్చించారు. సాధారణంగా ఇలాంటి వాటిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ లేదా జిల్లా మంత్రి లేదా స్థానిక ఎమ్మెల్యే చేతులు మీదుగా ప్రారంభిస్తారు. కొత్త ప్రభుత్వం వచ్చినందున వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవి ఆటోమేటిక్‌గా రద్దు అయిపోయింది. దాంతో సనపల చంద్రమౌళి కార్యాలయానికి రావడం లేదు. అప్పుడు, ఇప్పుడు కూడా విశాఖ తూర్పు ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబే ఉన్నారు. ఆయనకు చెప్పి ఈ కార్యక్రమం నిర్వహించాలి. గెలిచిన అభ్యర్థులంతా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చూడడానికి విజయవాడ వెళ్లగా, ఇక్కడ కలెక్టర్ మల్లికార్జున కైలాసగిరిపై గ్లోసైన్ బోర్డు ప్రారంభించేశారు.

రూ.22 లక్షలతో బంగ్లా ఆధునికీకరణ

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు పాండురంగాపురంలో బంగ్లా ఉంది. కలెక్టర్ మల్లికార్జునే కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండడంతో ఆ బంగ్లా ఖాళీగా ఉంది. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాట్లలో భాగంగా పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఈ బంగ్లాను తన క్యాంపు ఆఫీసుగా ఉపయోగించుకోవడానికి ఆరు నెలల క్రితం నిర్ణయించారు. దానిని ఆధునికీకరించాలని ఆదేశించారు. సుమారుగా రూ.30 లక్షలతో ఆధునికీకరించారు. లోపల లిఫ్ట్ కూడా ఏర్పాటుచేశారు. పూర్తయిన బంగ్లాను కూడా కలెక్టర్ ప్రారంభించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దానికి సంబంధించిన శిలాఫలకంపై తన పేరు వేయించుకున్నట్టు వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. ఓ ఐఏఎస్ అధికారి ఇలా వ్యవహరించడం ఏమిటని రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నాకు సమాచారం లేదు

కలెక్టర్‌కు తెలుగుదేశం నాయకులంటే లెక్క లేదు. ప్రజలు ఎన్నుకున్న నాయకులకు కూడా గౌరవం ఇవ్వడం లేదు. కైలాసగిరి నా నియోజకవర్గంలో ఉంది. ఆ పనులన్నీ ప్రజాధనంతో చేపట్టినవి. వాటిని ప్రారంభించే ముందు నిబంధనలకు ప్రకారం తెలియజేయాలి. కానీ ఆయన 'మార్కు' అనిపించుకోవడానికి రిబ్బన్ కట్ చేశారు. ఇది చాలా దారుణం.

- వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే, విశాఖ తూర్పు

యూపీఎస్సీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట, జూన్ 12: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 వ తేదీన జరిగే యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఆరోజు 26 కేంద్రాల్లో పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్న ఈపరీక్షకు మొత్తం 9635 మంది పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు.పరీక్ష కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించాలన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం,.జూన్ 12 : కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 14వ తేదీ శుక్రవారం మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆరోజు ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే.నాయుడు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఊర్వశి జంక్షన్ పాలిటెక్నిక్ కళాశాల, నలందనగర్, దేవేంద్రనగర్, ఇంటెలిజెన్స్ కార్యాలయం, అశోక్‌నగర్, గంగన్ననగర్, జోగారావు నగర్, తిక్క వానిపాలెం, ధర్మానగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల వినియోగదా రులుసహకరించాలని కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



రాజశ్యామల అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్, జూన్ 12: డాబాగార్డెన్స్‌లోని శ్రీ సాయి శ్రీమేరు ట్రస్ట్ ఆ ధ్వర్యంలో అనఘా లక్ష్మీ అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవా రం వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం సాయిదర్బార్ ప్రాంగణంలో అమ్మవార్ల సన్నిధిలోఅర్చకులు ప్రత్యేక పూజలు , మహాలక్ష్మీ హోమాన్ని ని ర్వహించారు. మహిళలు శ్రీ లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో శ్రీసాయి శ్రీమేరు ట్రస్ట్ చైర్మన్ పీఎస్వీజీ ప్రసన్న, కార్యదర్శి పి. శ్రీనివాసశాస్త్రి, జి.రమ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పి.సతీష్, ఎ.రామ్‌రా జ్, డా. కె.వీరభద్రం పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నప్రసా దం అందించారు.

16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్ షిప్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 12: బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లె క్సులో ఈనెల 16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ కమ్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మో హన్ వెంకటరామ్ తెలిపారు. గ్రూప్-1, 2, 3 కేటగిరిలకు సంబంధించి ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, ఐఎం మెడలీ ఈవెంట్లలో పోటీలు జరుగు తాయని పేర్కొన్నారు. ప్రతి స్విమ్మర్ ఐదు ఈవెంట్లలో మాత్రమే పాల్గొనేం దుకు అర్హులని స్పష్టం చేశారు. ఈ టోర్నీలో రాణించి జిల్లా జట్టుకు ఎంపికైన వారు జులై 13 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటార ని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 12వ తేదీలోపు జిల్లా స్విమ్మింగ్ కోచ్ శ్రీధర్ ఫోన్:8008 707798లో సంప్రదించి ఎంట్రీలు పొందాలన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత ఉపాధి శిక్షణ

కంచరపాలెం, జూన్ 12: కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో జూలై ఒకటో తేదీ నుంచి ఎస్సీఎస్టీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు సబ్ రీజన ల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఈ శిక్షణలో చేరదలిచే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా అందజేయాలన్నా రు. ఏడాదికి రూ.3లక్షలు ఆదాయం మించకుండా 18 నుంచి 27 ఏళ్ల వయ స్సు కలిగిన యువతీ యువకులకు ఈ శిక్షణకు అర్హులు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.వెయ్యి స్టైఫండ్ చెల్లించనున్నారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు స్పెషల్ కోచింగ్‌తో పాటు కంప్యూటర్ ఓ లెవల్ సా ఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ శిక్షణను అందించనున్నారు.దరఖాసులకు జూన్ 20వరకు గ డువు ఉందన్నారు.వివరాలకు ఫోన్: 0891-2788700లో సంప్రదించాలన్నారు.

నగరానికి పది కొత్త బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 12: నగరానికి నాలుగు రోజుల్లో పది కొత్త బస్సులు రానున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యింది. పది బస్సుల్లో ఒకటి ఆల్ట్రా డీలక్స్, 9 సూపర్ లగ్జరీ సర్వీసులు ఉన్నాయి. ఆర్టీసీ వి శాఖ రీజియన్‌లో ఉన్న 721 బస్సుల్లో 30 కాలం చెల్లినవి కావడం, అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. వాటిని వినియోగించడం వల్ల వచ్చే ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితులను గమనించిన అధికారులు వాటి సేవలకు స్వస్తి చెప్పి, ప్రత్యా మ్నాయంగా కొత్త బస్సులు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఈమేరకు గతంలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదించడం, వారు అంగీకరించ డం జరిగింది. దశల వారీగా కొత్త బస్సులు పంపేందుకు వారు తమ నిర్ణ యాన్ని తెలిపారు. అందులో భాగంగా పది బస్సులు నగరానికి రానున్నాయి.

సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతమ్మధార, జూన్ 12: ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కలిసి పని చేస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమేనని గాంధీ సెంటర్ అధ్యక్షులు, నాగార్జున యూనివర్శిటీ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య బాల మోహన్‌దాస్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, సాంత్వనా సేవా సమితి ముద్రించిన బాలల హక్కులు, చట్టాలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుల్లయ్య కళాశాల్లో గల గాంధీ సెంటర్‌లో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి అతిథి విచ్చేసిన ఆచార్య బాలమోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక అంశాన్ని సమస్యగా కాకుండా సవాలుగా చూడాలని, విద్యా హక్కు చట్టాన్ని నిజాయితీగా అమలు చేయా ల్సిన ఉందన్నారు. కార్యక్రమంలో గాంధీసెంటర్ సహాయ కార్యదర్శి డాక్టర్ సత్యమూర్తి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్ సీరిస్ రిజిస్ట్రేషన్ వాహనాల పన్ను చెల్లించాలి

డీటీసీ రాజారత్నం



డీటీసీ రాజారత్నం

మురళీనగర్, జూన్ 12: ఏపీలో తిరుగుతున్న బి.హెచ్ సీరిస్ రిజిస్ట్రేషన్ వాహన యజమానులు వెంటనే పన్ను చెల్లించాలని విశాఖపట్నం డీటీసీ జి.సి.రాజారత్నం పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో బి.హెచ్ సిరిస్ వాహన రిజిస్ట్రేషన్ల నిబంధనలను వివరించారు. ఒకే దేశం, ఒకే రిజిస్ట్రేషన్ విధానం ఏర్పాటు చేసిన దేశ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉంటే, అదే నంబర్‌తో దేశ వ్యాప్తంగా ఈ వాహన రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉందనే ఆ లోచనలో వినియోగదారులు ఉన్నారన్నారు. కానీ, బి.హెచ్ సీరిస్ రిజిస్ట్రేష న్‌తో పాటు సంబంధిత రాష్ట్ర పన్ను చెల్లించినపుడు మాత్రమే ఆ వాహనా న్ని వినియోగించాలని సూచించారు. వేర్వేరు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిం చుకుని జిల్లాలో తిరుగుతున్న వాహనదారులు వెంటనే టీడీపీ కార్యాల యాన్ని సంప్రదించి ట్యాక్స్ చెల్లించాలని అన్నారు. లేకుంటే ఆ వాహనాల ను సీజ్ చేస్తామని డీటీసీ హెచ్చరించారు.

జాతీయ ఉపకారవేతనాలకు నలుగురు ఎంపిక

మాధవధార, జూన్ 12; జాతీయ ఉపకార వేతన పరీక్షలో మాదవ ధార జీవీఎంసీ హైస్కూలు నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత డిసెంబరు 3వ తేదీన జరిగిన పరీక్షలకు సంబంధించి మంగళవారం ఫలితాలు వచ్చినట్టు హెచ్.ఎం బి.హేమలత తెలిపారు. ఈ ఎన్ఎం ఎంఎ స్ స్కాలర్‌షిప్‌లో భాగంగా 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలచొప్పున మూడేళ్లపాటు అందిస్తారు. పాఠశాలకు చెందిన జామి.మౌనిక, వై.శశాంక్, ఎ.ద్రాక్షణ్య, టి.దీవెన పరీక్షలో అర్హత సా ధించారు. విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.



ఆటోలో చంద్రబాబు ఫెక్సీ ఊరేగిస్తున్న దృశ్యం



రైల్వే న్యూ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం వేళ సంబరాలు

- ఎల్ఈడీ స్క్రీన్లపై మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం వీక్షణ
- చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



లక్ష్మీ గణపతి ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూన్ 12 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంద ర్భంగా 42వ వార్డు టీడీపీ నాయకులు బుధవారం రైల్వేన్యూకాలనీ ప్ర ధాన రహదారిలో సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థా పకుడు దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ గణపతి ఆలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు తెరపడిన ట్టయిందన్నారు. టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ కె. గోపాల్‌రెడ్డి, ఉత్తర ని యోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోట శ్రీదేవి, వార్డు టీడీపీ, బీజేపీ అధ్యక్షులు కన్నం వెంకటరణారావు, గురుగోవింద్ సింగ్, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ఎంఎల్ఎన్ రావు, శ్రీకృష్ణ, జేకే, దువ్వి కాళీ ప్రసాద్‌పాల్గొన్నారు. నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని ప్రజలంతా వీక్షించేందుకు 44వ వార్డు అబిద్‌నగర్‌లోని షాదీఖానాలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. దీంతోఅధిక సంఖ్యలో స్థానికులు వీక్షించారు.27వ వార్డులోని పలుచోట్ల కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.లక్ష్మీ శివ ప్రసాద్, బీఏ రెడ్డి, మండా గుర్రాచారి, తోణంగి శంకర‌రెడ్డి, మజ్జి వెంకట సత్యనారాయణ, పి.హేమలత, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు మొక్కు చెల్లింపు



తలనీలాలిచ్చిన వరప్రసాద్

మాధవధార; తెలుగుదేశం పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ 50వవార్డు అధ్యక్షులు, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల.వరప్రసాద్ బుధవారం సింహాచల శ్రీ వరహ లక్ష్మీన్న సింహస్వామి ఆలయానికి వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. సీఎంగా చంద్రబాబు, విశాఖ ఎంపీగా శ్రీ భరత్, నార్త్ ఎమ్మెల్యేగా పి.వి.కుమార్ రాజు గెలుపు సాధించడంతో తాను మొక్కుకున్న మేరకు అప్పన్నకు తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు.

మెగా డిఎస్సీపై హర్షం



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

సీతంపేట, జూన్ 12: మెగా డీఎస్సీపై టీడీపీ అధినేత చంద్రబాబునా యుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనపై నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ హర్షం వ్యక్తంచేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వద్ద నిరుద్యోగ విద్యార్థులతో కలిసి చంద్ర బాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులంతా కూటమి ప్రభుత్వంపై ఎంతో విశ్వా సంతో గెలిపించారన్నారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, పోలీస్, గ్రంథా లయ శాఖ, ఫైర్, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామ కాలు చేపడతారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సనపల తిరుపతి రావు, సత్య, లక్ష్మి సరోజిని, వాసుపల్లి రాంబాబు, జి.గోవింద్ పాల్గొన్నారు.

విశాఖ అథ్లెట్‌కు పతకాలు



ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న వాకర్స్ సభ్యులు

అక్కయ్యపాలెం, జూన్ 12 : భారతి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆఫ్ యూపీ ఆధ్వర్యంలో అ యోధ్యలోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన అం తర్జాతీయ ఛాంపియ యన్ షిప్‌లో ఏపీ తరపున కైలాసపురం ప్రాంతా నికి చెందిన విశాఖ అథ్లెట్ దువ్వూరి సరోజిని తన సత్తా చాటి స్వర్ణ, రజిత కాంస్య పతకాలు సాధించింది. వంద మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, 400 మీటర్ల పరుగులో రజితం, 5 కిలోమీ టర్ల నడక పోటీలో కాంస్య పతకాలను సాధిం చారు. ఈసందర్భంగా ఇండియా మాస్టర్స్ అథెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అమరేంద్రరెడ్డి ఆమెకు అభినందనలు తెలి పారు.

కనకమహాలక్ష్మి ఆలయ హుండీల లెక్కింపు



హుండీ లెక్కింపులో దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు

పూర్ణామార్కెట్, జూన్ 12:వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆలయంలో హుండీలను బుధవారం లెక్కించారు. మార్చి 21 తేదీనుంచి 12 జూన్ వరకు 83 రోజుల హుండీ ఆదా యం రూ. 59,16 ,692 లక్షలు వచ్చింది. బంగారం 131.500 గ్రాములు, వెండి 1 కేజీ 3 గ్రాములు లభించింది. అలాగే, విదేశీ కరెన్సీ కూడా ఉన్నట్టు ఆలయ ఈవో పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.ఈ లెక్కింపులో ఎర్నిమాంబ అమ్మ వారి ఆలయ సహా య కార్యనిర్వహణాధికారి వి. రాంబాబు, దేవస్థానం అధికారులు కె. తిరుమలేశ్వరరావు, ఎ.వి.ఎస్. లక్ష్మణమూర్తి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, శ్రీహరి సేవ గోపాలపట్నం, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

'సాగర్'కు కొత్త హంగులు



ఆధునికీకరించిన సెయిలర్స్ ఇనిస్టిట్యూట్

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నౌకాదళంలోని సెయిలర్స్ ఇనిస్టిట్యూట్ 'సాగర్'ను ఆధునికీకరించారు. విశ్వకర్మ ఆవరణలో ఉన్న దీన్ని ఇక్కడి చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందే సెయిలర్లు విశ్రాంతి తీసుకోవడానికి, ప్రేరణ పొందడానికి ఇక్కడి వాతావరణం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. నేవీ నౌకల్లో, ఇతర విభా గాల్లో పనిచేసే సెయిలర్లు, అగ్నివీర్‌లకు కూడా ఉపయోగపడుతుందన్నారు.

శ్రీశ్రీ నిరంతర ప్రయోగశీలి



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట, జూన్ 12: మహాకవి శ్రీశ్రీ సాహిత్యపరంగా అధ్యాయనంతోపాటు నిరంతర ప్రయోగ శీలి అని ఆచార్య వెలమల సిమ్మన్న పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగ ర్‌లోని ప్రిజమ్‌కళాశాలలో సహృదయ సాహితి సంస్థ అధ్య క్షులు శేఖరమంత్రి ప్రభాకర్ ఆధ్వర్యంలో 'శ్రీశ్రీ వర్ధంతి సభ, విలక్షణ విమర్శకులు శ్రీశ్రీ' అనే అంశంపై ప్రసంగ కార్యక్ర మాన్నినిర్వహించారు. ముఖ్యవక్తగా ఆచార్య సిమ్మన్న మా ట్లాడుతూ శ్రీశ్రీ ప్రజా పోరాటాలు గుర్తించడంపాటు అను నిత్యం కవిత్వాన్ని ఆరాధించారన్నారు. పదునైన విమర్శకు డిగా వినుతికెక్కార న్నారు. ఈ కార్యక్రమంలో ఇటీవల దివంగతులైన కవి, సహృదయ సాహితి వ్యవస్థాపక స భ్యులు, ప్రవచనకారుడు టీపీఎస్ ఆచార్యులు ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. డాక్టర్ కేవీఎస్ మూర్తి, డాక్టర్ డీవీ సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారా యణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'భాష్యం అప్పలాచార్యులు స్ఫూర్తి'

అక్కయ్యపాలెం, జూన్ 12: ట్రేడ్ యూనియన్ కార్యక లాపాల్లో పూర్తిగా తలమునకలై ఉన్న, తాను ఆధ్యాత్మిక రంగంవైపు మరలడానికి భాష్యం అప్పలాచార్యుల ఆశీస్సులే కారణమని హనుమాన్ చాలీసా ప్రచారకర్త కొమ్మూరు ఉమాప్రసాద్ తెలిపారు.శంకరమఠం ప్రాంతంలోని ఆయన స్వగృహంలో బుధవారం జరిగిన సత్సంగంలోఉమా ప్రసాద్ తన ఆధ్యాత్మిక అనుభవాలు, జ్ఞాపకాలు మిత్రులతో పంచు కున్నారు. సీనియర్ జర్నలిస్ట్ బీవీ అప్పారావును, భళ్లమూడి రామ్మూర్తిలను ఘనంగా సత్కరించారు.

స్పోర్ట్సు స్టార్ ఆఫ్ సౌత్ ప్రొఫెసర్‌గా విజయమోహన్‌కు టైటిల్



టైటిల్ అందుకుంటున్న విజయమోహన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 12: వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రంలో విశేష కృషి చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు సైన్సెస్ శాఖ డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్‌కు అరుదైన గౌరవం దక్కింది. జైపూర్ యూనివర్సిటీ గురువారం స్టార్ ఆఫ్ సౌత్ ప్రొఫెసర్ అవార్డుతో సత్కరించింది. విద్యారంగంలో క్రీడల ప్రాధాన్యతను పెంపు, వేలాది మంది విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సహించడంతోపా టు ఏయూ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రానికి దేశ వ్యా ప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన విజయ్‌మోహన్‌కు ఈ గౌరవం ద క్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పలాస పాసింజర్ శ్రీకాకుళం వరకే

విశాఖపట్నం, జూన్ 12: పూండి, నౌపడ మధ్య నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07471, 07470 నంబర్లు గల రైళ్లు గురువారం విశాఖ, శ్రీకాకుళం మధ్య నడుస్తాయని సీ నియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం, పలాస మధ్య రాకపో కలు రద్దు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు వసతి గృహాల్లో ప్రవేశాలు

మహారాణిపేట, జూన్ 11: విశాఖలో ఉన్న వసతి గృహాల్లో నాలుగో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జే మాధవి తెలిపారు. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు ఉచిత భోజనం వసతితో పాటు కాస్మోటిక్స్, యూనిఫారాలు, నో ట్ పుస్తకాలు వీటితో పాటు ప్రభుత్వపరంగా ఇతర సదుపాయం అం దజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగ పురుష విద్యార్థులు వైద్య ధ్రువీకరణ ప త్రం, స్కూల్ టీసీ , ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువ పత్రంతో దరఖాస్తు చే యాలన్నారు. వసతి గృహాల వార్డెన్‌ను ఫోన్: 9441466347, పెందుర్తి వ సతిగృహవార్డెన్‌ను 9505494632లను సంప్రదించాలని కోరారు.

'ఆప్సా' జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ మృతి



జోగి సోమశేఖర్ (ఫైల్‌ఫొటో)

మహారాణిపేట/ కంచరపాలెం, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేష న్ విశాఖ జిల్లా అధ్యక్షుడు జోగి సోమశేఖర్ బుధవారం ఉదయం ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన కంచరపాలెంలోని గిరిషాస్ శ్రీ చైతన్య స్కూల్ కరస్పాండెంట్‌గా వ్యహరిస్తున్నారు. సోమశేఖర్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రైవే ట్ స్కూల్స్ (మేప్స్ సంస్థ)వ్యవ స్థాపకు లుగా ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరి ష్క రిం చటంలో గత రెండు దశాబ్దాలుగా ఆయన ఎనలేని కృషి చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వానికి వారధిగా ఉం టూ అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో ఆ యన కృషి అమోఘమని పలువురు కొనియాడారు. ఆయన మృతికి అన్ని స్కూల్స్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ఆప్సా రాష్ట్ర కార్యవర్గం సంతాపం తెలిపింది.

'పాత్రికేయరంగంలో రామోజీరావు అద్వితీయం'



రామోజీరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట, జూన్ 12: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు పాత్రి కేయ రంగంలో విలువలను నెలకొల్పడంతోపాటు ఉన్నత శిఖరాలను అధిరోహించా రని పలువురు కొనియాడారు. పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వ ర్యంలో బుధవారం రామోజీరావు సంస్మరణ సభను నిర్వహించారు. రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం రెండునిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ రామోజీరావు పాత్రికేయ రంగంలో శిఖరాయమానంగా వెలుగొందారన్నారు. మానవ సంబంధాలపై ఎనలేని మక్కువతో కృషి చేశారన్నా రు. రామోజీరావు లేని లోటు ఎవరూ తీర్చలేనిదన్నారు. అనంతరం రామోజీ రూపొందించిన మయూరి చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భరణికాన రామారావు, బి. చిన్నారావు, డాక్టర్ విగ్నేశ్వర బాబ్జీ, చాట్ల బాబూరావురెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

వేతన సవరణ సమస్యను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

డాబాగార్డెన్స్, జూన్ 12: బీఎస్ ఎన్ఎల్‌లో వేతన సవరణ సమస్యతోపాటు నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ఈయూ, ఎస్ఎన్ఏటీటీఏ జాయింట్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో భోజన విరామ సమయంలో ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారంపై బీఎస్ఎన్ఎల్ యాజమాన్యం సవతి తల్లి వైఖరి అవలంబిస్తుందని వాపోయారు. ఈస్థితిలో సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ఈయూ, ఎస్ఎ న్ఏటీటీఏ జాయింట్ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు పాటించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖపట్నం, జూన్ 12: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ అన్నారు. జి ల్లా న్యాయసేవాధికారసంస్థ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయు క్తంగా బుధవారం మాదవధార కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో న్యా య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చె త్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వహణ చేయాలన్నా రు. ఈ సదస్సులో కృష్ణా కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ఎస్ఆర్‌కే రావు, ఆంధ్రప్రదే శ్ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీరామచంద్ర మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ సునీల్ కుమార్, జిందా ల్ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి సతీష్, పాల్గొన్నారు.

నేడు వైవీ సుబ్బారెడ్డి రాక

- ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులతో భేటీ

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి గురువారం నగరానికి రానున్నారు. త రచూ నగరానికి వచ్చి వెళ్తుండే సుబ్బారెడ్డి ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత నగ రం ముఖం చూడలేదు. ఫలితాలు వచ్చిన తరువాత ఆయన నగరానికి రావడం ఇదే మొదటిసారి. ఈమేరకు ఆయన గురువారం ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో భేటీ కానున్నట్టు సమాచారం. ఓటమికి గల కారణాలను వారిని అడిగి తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తు కార్యా చరణను కూడా వివరించనున్నారు. అనంత రం జీవీఎంసీ మేయర్ పీఠం మారిపో తుందన్న ప్రచారంపై కూడా సుబ్బారెడ్డి నేతలతో చర్చించనున్నట్టు తెలిసింది. నియోజకవర్గాల సమన్వయకర్తలకు తమ పరిధిలోని వైసీపీ కార్పొరేటర్లు ఇతర పార్టీల్లో చేరిపోకుండా కాపాడుకునే బాధ్యతను అప్పగించనున్నట్టు పార్టీలో ప్ర చారం జరుగుతుంది. పార్టీ తిరిగి పుంజుకుంటుందన్న భరోసాను కార్పొరేటర్లకు క ల్పించాలని ఇప్పటికే సమన్వయకర్తలకు పార్టీ అధిష్టానం నుంచి ఆదేశం అందిందని, అందుకే రెండు రోజుల కిందట ఉత్తర నియోజకవర్గం పరిధిలోని కా ర్పొరేటర్లతో సమన్వయకర్త కేకేరాజు సమావేశం ఏర్పాటు చేసినట్టు సమాచారం.

నేవీ అధికారులకు శిక్షణ



గీతంలో శిక్షణ పొందుతున్న నేవీ అధికారులు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కలిసి పనిచేస్తూ నేర్చుకోవడంలో భాగంగా తూర్పు నౌకాదళం అధికారులు గీతం యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్ కోర్సును అధ్యయనం చేశారు. వారికి ఈనెల 10, 11వ తేదీల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. దీన్ని ఐఎన్ఎస్ కళింగ విభాగం సమన్వయం చేసింది. దీంతో పా టు మెషిన్ లెర్నింగ్‌పై కూడా అవగాహన కల్పించారు.

జగదాంబ జంక్షన్‌లో క్లాక్‌టవర్ సొబగులు

- నాలుగు వైపులా గడియారం ఏర్పాటు



తుదిదశలో క్లాక్‌టవర్ నిర్మాణం

జగదాంబ కూడలి, జూన్ 12: జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ క్లాక్ టవర్‌కు నాలుగు ముఖాలతో ఏర్పాటుచేసిన గడియారం ఆకట్టుకుంటోంది. నగరంలో జగదాంబ జంక్షన్‌కు వ్యాపార కూడలిగా, సినిమాథియేటర్స్‌కు కేరాఫ్‌గా విరాజిల్లుతోంది. దీనికి తోడు పర్యాటకులను ఆకర్షించే విధంగా జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారులు రూ. 2.50 కోట్లతో క్లాక్ టవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేశంలోని నగరాల్లో క్లాక్ టవర్‌ల ల్యాండ్ మార్క్‌గామారిన విషయం తెలిసిందే. ఇకపై జగదాంబ జంక్షన్ కూడా క్లాక్ నిర్మాణంతో సరికొత్త కళను తెచ్చిపెడుతుంది. పర్యాటకంగా ఇటువంటి నిర్మాణాలతో మరింత ఖ్యాతి సంతరించుకుంటుంది. కొత్తగా ఏర్పాటుచేసిన క్లాక్ టవర్ మరికొద్ది రోజుల్లో గంటలు మోగుతూ సందడి చేయనుంది. ఇప్పటికే ఇక్కడ క్లాక్ టవర్ ని ర్మాణంతోపాటు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులతో జగదాంబ పరిసరాలకు కొత్త హంగులునెలకొన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తున్న నేపథ్యంలో నగరం మరింత అభివృద్ధి బాటలో పయనించి పర్యాటకులను ఆకట్టు కుంటుందని పలువురు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



బాబు ప్రమాణ స్వీకారంతో ఆనందం

వేపగుంట, జూన్ 12 : చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం వీక్షణకు వీలుగా టీడీపీ 93వ వార్డు అధ్యక్షుడు గంగ వరహాలు ఆధ్వర్యంలో ప్రహ్లాదపురం కల్యాణ మండపంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య తిలకించారు. అనంతరం కార్పొరేటర్ రాపర్తికన్నా సమక్షంలో స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, అప్పారావు, వరహాలు, వెంకట్, గాంధీ, దుర్గాప్రసాద్, గిరి పాల్గొన్నారు. వేపగుంట జోన్- 8 కార్యాలయంలోనూ ప్రమాణ స్వీకారాన్ని ప్రదర్శించారు.


స్వీట్లు పంచుకుంటున్న టీడీపీ నాయకులు





'ఎంతటి త్యాగాలకైనా వెనుకాడేది లేదు'


రిలే నిరాహార దీక్షల శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జూన్ 12 : ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,217వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉక్కు అంశంపై అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుందని విమర్శించారు. కూటమి నాయకులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉక్కు కర్మాగారానికి న్యాయం చేయాలని కోరారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పెద్దలు ప్రధాని మోదీతో చర్చించి ఉక్కు కర్మాగారంపై విధించిన కఠిన ఆంక్షలను ఎత్తివేయించడంతో పాటు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉక్కు యాజమాన్యం తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు.






శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రి

శ్రీహరిపురం ఆస్పత్రిలో సమస్యల తిష్ఠ

మల్కాపురం, జూన్ 12: జీవీఎంసీ శ్రీహరిపురం ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బందికి గత కొన్ని నెలలుగా అందకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఆస్పత్రిలో ముఖ్యంగా రోగులకు అవసరమైన బీపీ మాత్రలు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి విచ్చేసే పలువురు ఇబ్బందులు పడుతున్నారు. అయితే బీపీ మాత్రలు రెండు మూడు రోజుల్లో వస్తా యని అధికారులు చెబుతున్నారు. బీపీ ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేదలు ఆస్పత్రికి చికిత్సకు వచ్చి సంబంధిత మాత్రలు అందుబాటులో లేవని తెలియ డంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట మందుల షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వైద్యులకు ఆరు నెలలుగా, సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు అందనప్పటికీ రోగులకు వైద్య సేవలు సక్రమంగానే అందిస్తున్నారు. కాగా ఈ ఆస్పత్రిలో ఓపీ కూడా రానురాను తగ్గుతూ వస్తుంది. గతంలో రోజుకు రెండు వందల నుంచి మూడు వందల మంది వరకు రోగులు వివిధ వైద్య పరీక్షల కోసం వచ్చేవారు. ఇప్పుడు ఓపీ వంద కూడా దాటడం లేదని తెలిసింది. ఆస్పత్రి నిర్వహణ గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించాలి'

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి వర్మ ప్రకటన చేయాలని ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్ సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు పెట్రోలియం శాఖా మంత్రి ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అదేవిధంగా స్టీల్‌ప్లాంటుపై కూడా సంబంధిత మంత్రులు మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేసి సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వైటీ దాసు, రామస్వామి, శ్రీనివాసరాజు, అప్పారావు, సత్యనారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.











అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.













దువ్వాడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు



రామకృష్ణాపురంలో చంద్రబాబు కటౌట్ వద్ద టీడీపీ శ్రేణులు

బాబు ప్రమాణ స్వీకారంతో సంబరాలు

కూర్మన్నపాలెం, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో దువ్వాడలో టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సారిపల్లి పైడిరాజు, యు.శ్రీను, రాము, తదతరులు పాల్గొన్నారు. అలాగే 70వ వార్డు పరిధి ఎల్వీ నగర్‌లో కూటమి నాయకులు కేక్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు,ఎల్.మురళీదేవి, కృష్ణంరాజు,చట్టి బాబు, సూరిబాబు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికంగా గల పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి రావడం వల్ల ప్రజలు, ఉద్యోగులకు మంచి రోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, బి.అప్పారావు, బి.చందూరమేశ్, పి.రాము, శ్రీను, ప్రసాద్, పి.పైడిరత్నం, పాల్గొన్నారు.

మల్కాపురం: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో రామకృష్ణాపురం వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశాక చంద్రబాబు కటౌట్ వద్ద కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పూడి భాస్కరరావు, రాంబాబు, ఈశ్వరరావు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ పూలమాలలు వేశారు.

మొక్కు చెల్లించిన టీడీపీ నాయకుడు

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తే 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్న తుంగ్లాంకు చెందిన టీడీపీ నాయకుడు గిడుతూరి అప్పారావు తన మొక్కును తీర్చుకున్నారు. ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశాక ఆయన పలువురు పార్టీ నాయకులతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టారు.











పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



పెందుర్తి, జూన్ 12 : సింహాచలం దేవస్థాన పరిధిలోని పంచ గ్రామాల భూ సమస్య తొలి ప్రాధాన్యంగా గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విలేకరులతో మాట్లాడారు. పంచ గ్రామాల భూ సమస్యపై అధ్యయనం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లేందుకు యోచిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగ పెందుర్తిలో స్పోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు.గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చినముషిడివాడ వుడా కాలనీలో స్థల సేకరణ చేశామని, అప్పట్లో వుడా నుంచి నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులు మంజూరైన విషయం గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించి తీరుతానని భరోసా ఇచ్చారు. పరవాడ మండలంలో కాలుష్యంతో సతమవుతున్న తాడి గ్రామాన్ని తరలించి నివాసితులకు పునరావాసం కల్పిస్తామన్నారు. ఫార్మా సిటీలోని స్థానిక నిర్వాసితులకు ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. సబ్బవరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చుదిద్దుతామన్నారు.

నేడు జన్మదిన వేడుకలు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు గురువారం జరగనున్నాయి. ఈమేరకు పెందుర్తి, సబ్బవరం, పరవాడలోని కూటమి నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వేపగుంట సమీపాన చీమలాపల్లి దరి మీనాక్షి కన్వెన్షన్‌లో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, కేక్ కట్ చేస్తారు. అలాగే సేవా కార్యక్రమాల్లో భాగంగా అభిమానులు మెగా రక్తదాన శిబిరం, వృద్ధులకు అన్నదానం, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

వేపగుంట, జూన్ 12 : అనకాపల్లి ఎంపీ సీ.ఎం. రమేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రహ్లాదపురం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రాపర్తికన్నా పాల్గొని కేక్ కట్ చేశారు. గాయత్రి ఆలయంలో సి.ఎం. రమేష్ జన్మదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భరత్‌నగర్ దరి శ్రీ లక్ష్మీనరసింహనగర్‌లోని గోపిజనవల్లభ స్వామి ఆలయంలో ఆయనపేరిట ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలనాయకులు మామిడి దుర్గాప్రసాద్, గిరి, వరహాలు, నూకరాజు, వెంకట్, గాంధీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్స్ పంపిణీ..

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు మర్రిపాలెం ఉడాకాలనీలో నాయకుడు ఎమ్.వాసుదేవరావు ఆధ్వర్యంలో చంద్రబాబు స్వీకారం పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు స్వీట్స్ పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుజ్జి, రమేష్, నాయుడు పాల్గొన్నారు.

బొల్లినేని మెడిస్కిల్ విద్యార్థినికి రూ. 37 లక్షల వార్షిక వేతనం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 12: బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ కార్డియో కేర్ టెక్నాలజీ కోర్సు చేసిన నన్నం నిస్సీ బ్రిటన్‌లోని ఓ ఆస్పత్రిలో రూ.37 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికైనట్టు మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో జెమ్స్ మెడికల్ కాలేజీ చీఫ్ చీఫ్ బొల్లినేని భాస్కరరావు, సంస్థ ఈడీ, తదితరులు నిస్సీకి అభినందనలు తెలిపారు.

నేడు సరిపల్లి ముత్యమాంబ పండుగ

పెందుర్తి, జూన్ 12: మండలంలోని సరిపల్లిలో ముత్యమాంబ పండగ గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు వేసి శోభాయమయంగా తీర్చిదిద్దారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ పురవీధుల వరకు విద్యుత్‌లైటింగ్ ఆకట్టుకుంటోంది. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో భోజనాలు



వేపగుంట, జూన్ 12 : నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో వేపగుంటలోని అన్నక్యాంటీన్ వద్ద స్థానిక బాలాజీ హోటల్ అధినేత బాలాజీరాము ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత భోజనాలను టీడీపీ 93వ కార్పొరేటర్ రాపర్తికన్నా ప్రారంభించారు. టీడీపీపై అభిమానంతో 400మంది పేదలకు అన్నదానం చేసినట్టు బాలాజీరాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెశెట్టి అప్పారావు, మామిడి దుర్గాప్రసాద్, దేముడు, రాజుద్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న వెంకటేశ్వర్లు, తదితరులు

ప్రతి ఒక్కరూ విధిగా మొక్క నాటాలి

ఆటోనగర్, జూన్ 12 : ప్రతి పౌరుడూ విధిగా ఒక మొక్కనైనా నాటాలని ఏపీఐఐసీ జెడ్ఎం ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. ఏపీఐఐసీ, ఐలా పాలక సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత ఆటోనగర్‌ను తీర్చిదిద్దేందుకు విరివిగా మొక్కలు నాటాలని, కాలుష్య నివారణకు పారిశ్రామికవేత్తలందరూ కృషి చేయాలన్నారు. ఆటోనగర్‌లోని పలు బ్లాక్‌లలో,శివారు ప్రాంతంలో సుమారు వంద మొక్కలను నాటినట్టు ఐలా కమిషనర్ కె.జయచంద్ర పేర్కొన్నారు. ఆటోనగర్‌లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు. ఐలా చైర్మన్ రఘు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటకపోతే భవిష్యత్తులో కాలుష్యం వల్ల విపత్కర పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమల అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, పి.పద్మావతి, ఈవీ రాంప్రసాద్, పరుచూరి ప్రభాకర్, పారిశ్రామికవేత్తలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్, రమేశ్, సత్య, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో కర్తవ్య 2కే - 24 సేవలు

అగనంపూడి, జూన్ 12: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎంబీఏ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం కర్తవ్య-2 కే24 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లోని ఏడు అనాథాశ్రమాలకు చెందిన 195 మంది పిల్లలకు దుస్తులు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ, నిత్యావసర సరకులు, ఫ్యాన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు సేవా దృక్పథంతో కర్తవ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వీరిని మిగతా విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకుని, అనాథలకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం ఎంబీఏ విద్యార్థులు చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయడంతో పాటు వివిధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆ చిన్నారులకు వైద్యులు రక్త, దంత పరీక్షలు నిర్వహించారు.

ఉక్కు శాఖా మంత్రిని కలిసిన స్టీల్‌ప్లాంట్ సీఎండీ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12: కేంద్ర ఉక్కు శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన హెచ్‌డీ కుమారస్వామిని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతికి సహకారాన్ని అందించాలని కోరుతూ ఉక్కులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించారు.

కళాకారులను ఆదుకోవాలని వినతి

మల్కాపురం, జూన్ 12 : అందరికీ తమ కళల ద్వారా వినోదాన్ని అందిస్తున్న కళాకారులకు ప్రోత్సాహం కరువైందని, దీంతో వారు అనేక సమస్యలతో సతమతమవుతున్న వారిని కోరమాండల్ కర్మాగారం వంటి సంస్థలు ఆదుకోవాలని కోరుతూ గాజువాక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కోరమాండల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన అధికారులు వినతిపత్రంలో పేర్కొన్న ప్రతి అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గుడివాడ శ్రీనివాసరావు, నూనెల పైడిరాజు, వెంకటేశ్వరరావు, అల్లు జోగినాయుడు, దుబాయ్ రాజు. శరత్, జ్యోతి, కుమారి, కె.మంగ, తదితరులు పాల్గొన్నారు.

















మొక్క నాటుతున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఆర్‌జేడీ

మధురవాడ, జూన్ 12 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్ అన్నారు. బుధవారం ఆయన మధురవాడలోని భవిత కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఉన్న భవిత కేంద్రాల్లో ఇంద్రియ వనాల్లో భాగంగా పూలు, ఔషధ మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. ఏపీ స్టేట్ ఐడీ కోఆర్డినేటర్ శైలా కల్పన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మూడేళ్లు పెరిగిన ఒక చెట్టు ఏడాదికి టన్ను ప్రాణ వాయువు ఇస్తుందన్నారు. ప్రతిఒక్కరూ కనీస బాధ్యతగా పది మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటేలా హితబోధ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత నిత్య కల్యాణం



సింహాచలం, జూన్ 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'కావాలనే ప్లాన్‌లో మార్పు'

సింహాచలం, జూన్ 12 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పనుల్లో 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, కమిషనర్ సాయికాంత్ వర్మ, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి కుమ్మక్కై కావాలనే అలైన్మెంట్‌ను మార్చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ ఆరోపించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారుల నిర్ణయం వల్ల సుమారు 30 మంది కుమ్మర్లు, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ముందు అనుకున్న ప్లాన్ కాదని తరువాత తీసుకున్న నిర్ణయం వల్ల రోడ్డు పక్కన తాము కూడా పది అడుగులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, జూన్ 12 : పద్మనాభం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పాండ్రంగి, సామయ్యవలస 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్3 ఈఈ (ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సినిమా గైడ్

- **సత్యభామ :** సంగం, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), శ్రీహరిపురం (ఎస్.వి.సి.లిఖిత)
- **లవ్ మౌలి :** శారద, లక్ష్మీ (గాజువాక)
- **గోల్డ్ నెం.1 :** శ్రీకాంతి
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** శరత్, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, సౌజన్య (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 24, క్యారెట్ 30, దొండకాయలు 26, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 180, బరబటి 60, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 34, కీరదోస 28, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..



21వ వార్డు పెదవాల్తేరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



ఆనందపురంలోని వెల్లంకి గ్రామంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాష్ట్రానికి మంచి రోజులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఊరూవాడా సంబరం
- పలుచోట్ల కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచిన కూటమి నాయకులు
- ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ వెలుగులు



సింహాచలం తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న బ్రాహ్మణులు



భీమిలిలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు విద్యుత్ లైటింగ్

మధురవాడ, జూన్ 12 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో వాంబే కాలనీలో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడంతోపాటు అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు.

అప్పన్నకు పూజలు

సింహాచలం : ఎన్నికల్లో కూటమి గెలుపొందడంతో ఏపీ బ్రాహ్మణ ఐక్యవేదిక, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి సంయుక్తంగా తొలిపావంచా వద్ద బుధవారం కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. చంద్రబాబు సారథ్యంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో 108 కొబ్బరికాయులు కొట్టి,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వంగూరి గణేష్, చిలకమర్రి సాయిరామ్, బులుసు సుబ్రహ్మణ్యం, నండూరి వెంకట మురళీకృష్ణ, సూర్య భవాన్, వీహెచ్‌పీ నేత పూడిపెద్ది శర్మ, తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో...

పెదవాల్తేరు : రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో 21వ వార్డు చినవాల్తేరులోని హోమన హోటల్ వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర, 20వ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి, పీతల అవినాష్, నక్క వినయ్, పీతల మూర్తి, రవి, మురళి, ప్రసాద్, మనీతు కనకరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రజికవీధిలో నాయకులు బుధవారం రాత్రి అప్పలమ్మ అమ్మవారికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, మురళి, సాయి, అనిల్, రాధ, శ్యామ్ పాల్గొన్నారు.

వెల్లంకిలో..

ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీలో కూటమి నాయకులు సంబరాలు జరిపారు. రాష్ట్ర 4వ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో భారీ కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. అనంతరం సచివాలయ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దుర్మార్గ పాలన పోయి, రామరాజ్యం వచ్చిందన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా చంద్ర బాబు పాలన కొనసాగుతుందని చెప్పారు.

పద్మనాభం (రూరల్) : చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో మద్ది, కృష్ణాపురం, రేవిడి, అనంతవరం, పొట్నూరు, తునివలస గ్రామాల్లో నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అలాగే పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ లైటింగ్‌తో సుందరంగా అలంకరించారు.

లైటింగ్‌తో ప్రభుత్వ కార్యాలయాలు

భీమునిపట్నం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ లైటింగ్ అమర్చారు. విద్యుత్ వెలుగులతో కార్యాలయాలన్నీ ధగధగలాడుతున్నాయి. ఆర్డీవో కార్యాలయం, మండల పరిషత్, తహసీల్దార్, తదితర కార్యాలయాలను రంగురంగుల సీరియల్ బల్బులతో సుందరంగా అలంకరించారు.



కళా వేదికపై భజన చేస్తున్న బృందాలు

సింహగిరిపై నిర్విరామంగా భజనలు

సింహాచలం, జూన్ 12 : నగరానికి చెందిన హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మారుతి సారథ్యంలో సింహగిరిపై జరుగుతున్న నిత్య భజన సంకీర్తనలు బుధవారం నాటికి 300 రోజులు పూర్తయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రెండు గంటల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భజన బృందాలు రామ, కృష్ణ, వెంకటేశ్వర, నారసింహ, తదితర హిందూ దేవుళ్లకు చెందిన పాటలు, అన్నమయ్య కీర్తనలు గానం చేస్తూ భజనలు చేస్తున్నారు. నిత్య భజనలను ఏడాది పాటు నిర్విరామంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు సీనియర్ పురుషుల రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

భీమునిపట్నం, జూన్ 12 : పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం జిల్లా రగ్బీ సీనియరు జట్టు ఎంపిక పోటీలు జరగనున్నట్టు రగ్బీ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిశోర్ కుమార్ తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన వారు ఈనెల 15, 16 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు వారు చెప్పారు.

నేడు తునిపాలంలో ముత్యాలమ్మ పండగ

పద్మనాభం (రూరల్), జూన్ 12 : మద్ది పంచాయతీ పరిధిలోని తునిపాలం గ్రామంలో గురువా రం ముత్యాలమ్మ పండగ జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు తరువాత ఘటాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం గుడిలో ఉంచుతారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేయిస్తున్న యోగా గురువు సత్యనారాయణ

ఆరిలోవ, జూన్ 12 : ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరో గ్యం లభిస్తుందని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు అన్నారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆయన చినగదిలి నార్త్ షిర్డీ ఆలయం ఆవరణలో యోగా శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శిక్షణ ఈనెల 21వ తేదీ వరకు ఉంటుందన్నారు. అనంతరం ప్రముఖ యోగా గురువు బుడ్డిగ సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఆంజనేయపాత్రో, రాము, వానపల్లి మంగరాజు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ అధికారులు

ఏయూ స్థల ఆక్రమణ అడ్డగింపు

మద్దిలపాలెం, జూన్ 12 : శివాజీ పార్క్ ఎదురుగా శివాజీపాలెంలోని ఏయూ క్వార్టర్స్ స్థలాన్ని ఆక్రమించి జీవీఎంసీ ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై స్థానికులు ఏయూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, ఇంజినీరింగ్ అధికారులు బుధవారం ఆ నిర్మాణాలను పరిశీలించారు. క్వార్టర్స్ ప్రహరీ పడగొట్టి చేస్తున్న నిర్మాణాలను అడ్డుకున్నారు. ప్రహరీ కూల్చి నిర్మాణాలు ఎందుకు చేస్తున్నారని యజమానులకు నిలదీశారు. తమ స్థలంలో నిర్మాణాలు చేస్తే తొలగిస్తామని హెచ్చరించారు. కూల్చిన ప్రహరీ నిర్మించాలని చెప్పారు. కాగా ఏయూ క్వార్టర్స్ స్థలం ఆక్రమించి చేపట్టిన నిర్మాణానికి ఏయూ ఉద్యోగులు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే ప్రహరీ కూల్చి దర్జాగా నిర్మాణం చేపట్టారని చెబుతున్నారు.

అంతరాలయంలో ఆర్జిత సేవలు పునరుద్ధరించాలి

సింహాచలం, జూన్ 12 : అప్పన్న అంతరాలయంలో ఆర్జిత సేవలను పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. 2021 కరోనా సమయంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యక్ష ఆర్జిత సేవలను రద్దు చేసి, ఆన్‌లైన్ సేవలను అమలు చేసింది. కరోనా తరువాత ఇప్పటికి రెండేళ్లుగా అంతరాలయ ఆర్జిత సేవలను నిర్వహించపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిం హాచలం దేవస్థానంలో కరోనాకు ముందు ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు అంతరాలయంలో సహస్ర నామార్చన (రూ.500) నిర్వహించేవారు. దీనికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చేది. ప్రస్తుతం ప్రతిరోజూ ఉదయం ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులకు సహస్ర నామార్చన చేస్తున్నా... భక్తుల నుంచి పెద్దగా స్పందన ఉండడం లేదు. అలాగే ప్రతి గురు, ఆదివారం ప్రభాతారాధనల తరువాత ఆర్జిత స్వర్ణ పుష్పార్చన (రూ.2116) కూడా అంతరాలయంలో చేసేవారు. స్వర్ణ పుష్పార్చనకు ఉన్న డిమాండ్ దృష్ట్యా టికెట్లను పరిమిత సంఖ్యలో విక్రయించేవారు. లక్ష తులసీ దళార్చన కూడా భక్తుల కోరిక మేరకు జరిపేవారు. అంతరాలయ ఆర్జిత సేవల్లో పాల్గొనే వారు స్వామి వారి సన్నిధిలో కొంత సమయం గడిపేందుకు అవకాశం దొరికేది. అంతరాలయ ఆర్జిత సేవలను నిలిపివేసి, ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మట్టి తవ్వకాలు చేపట్టిన వాహనాలకు జరిమానా

పద్మనాభం, జూన్ 12 : మండలంలోని రేవిడి పంచాయతీ రెడ్డివాని కల్లాలులోని రైతుల పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన వాహనాలకు రూ.15 వేలు జరిమానా విధించినట్లు పద్మనాభం పోలీసులు చెప్పారు. ఈనెల 10న రైతుల పొలాల్లో మట్టి అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా ఒక పొక్లెయినరు, లారీని సీజ్ చేసి తహసీల్దారుకు నివేదిక సమర్పించామన్నారు. ఈమేరకు తహసీల్దారు పొక్లెయినరుకు రూ.10వేలు, లారీకి రూ.5 వేలు అపరాధ రుసుం విధించారని వారు తెలిపారు.

పూడికలతో కాలువలు

ఆరిలోవ, జూన్ 12 : జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో ఉన్న ప్రధాన కాలువ పూడికలతో నిండిపోయింది. కాలువలో నెలలు తరబడి పూడికలు తీయకపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు అటువైపు రాకపోకలు చేయలేకపోతున్నారు.

రైతు బజారు ప్రారంభోత్సవం ఎప్పుడు?

ఆరిలోవ, జూన్ 12 : జీవీఎంసీ పదో వార్డులోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకొని రూ. 80 లక్షలతో నిర్మించిన రైతు బజారు ఇప్పటివరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీంతో ఆరిలోవ ప్రాంతంలోని ప్రజలు కూరగాయల కొనుగోలుకు ఎంవీపీ రైతు బజారుకు వెళుతున్నారు. స్థానికుల వినతి మేరకు గత ఏడాది ఏప్రిల్‌లో రైతుబజారు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన రోజున మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ రైతు బజారు నిర్మాణాన్ని అదే ఏడాది ఆగస్టు నాటికి పూర్తిచేసి, ప్రారంభిస్తామని తెలిపారు. ఈమేరకు 40 దుకాణాలతో రైతుబజారు నిర్మించారు.అయితే కాంట్రాక్టర్‌కు ఇంకా రూ. 20 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి ఉండడంతో ఆయన 80 శాతం పనులు పూర్తి చేసి విడిచిపెట్టారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుబజారు పనులను పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై దుకాణాల ఏర్పాటుతో ఇబ్బందులు



ఏఎస్ రాజా కళాశాల రోడ్డు పరిస్థితి

ఎంవీపీ కాలనీ, జూన్ 12 : ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి ఏఎస్ రాజా కళాశాలకు వెళ్లే రోడ్డు సగం వరకూ ఆక్రమణకు గురైంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన దుకాణాలున్న వారు అక్కడ వ్యాపారం చేసుకోకుండా,రహదారిని కూడా ఆక్రమించడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది ఎదురవుతోంది. పాదచారుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.దుకాణాల ముందు సామగ్రితో పాటు వాటిని కొనుగోలు చేయడానికి వచ్చే వారు వాహనాల నిలుపుదల చేస్తుండడంతో రాకపోకలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఫుట్‌పాత్‌లపై జీవీఎంసీ అధికారులు కొన్ని బడ్డీలను తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా రోడ్డుపై పెట్టే సామగ్రిని తీయించారు. కానీ ఈ ప్రాంతంపై మాత్రం ఇరు శాఖలు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.సంబంధిత శాఖల సిబ్బంది ఇక్కడి వ్యాపారులతో కుమ్మక్కవడం వల్లే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



భీమిలిలో పుస్తకాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు కల్పన

స్టాక్ పాయింట్‌లో పాఠ్య పుస్తకాలు పరిశీలన

ఆరిలోవ, జూన్ 12 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గోడౌన్‌కు వచ్చిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి గోడౌన్‌కు చినగదిలి మండలంలోని 72 పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలు వచ్చాయని తెలిపారు మొత్తం లక్షా 58 వేల పాఠ్య పుస్తకాలకు గాను లక్షా 30 వేల 870 పుస్తకాలు వచ్చాయని, ఇంకా 27, 223 పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు. అలాగే 89,942 నోట్ పుస్తకాలకు గాను అన్నీ వచ్చాయన్నారు. 11,541 బెల్ట్‌లకు 6,330 కాగా స్కూల్ బ్యాగులు 13,148 గాను పూర్తిస్థాయిలో వచ్చాయన్నారు. మండలంలో 14 ఉన్నత, 2 ప్రాథమికోన్నత, 56 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్ రవీంద్రబాబు, అనూరాధ, జిల్లా సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ గీత, డి. అప్పలనాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు

భీమునిపట్నం : పట్టణంలోని గొల్లలపాలెంలో కేజీబీవీ విద్యాలయంలో ఉన్న నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర సమగ్ర శిక్షణ కార్యాలయం నుంచి వచ్చిన పరిశీలకురాలు కల్పన బుధవారం సందర్శించారు.స్టాక్ పాయింట్‌లో వున్న నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లపై జగనన్న విద్యా కానుక, తదితర గత ప్రభుత్వ స్టిక్కర్లు లేకుండా చేసి ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈమేరకు కిట్ల పంపిణీని దాకమర్రి హైస్కూల్, మూలకుద్దు ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, స్టాక్ పాయింట్ హెచ్‌ఎం గంగా కుమారి, సీఆర్‌పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

గ్రీనరీలో భవన నిర్మాణ వ్యర్థాలు



గ్రీనరీలో వేసిన డెబ్రిస్

ఆరిలోవ, జూన్ 12 : జీవీఎంసీ పరిధిలోని 12వ వార్డు శివాలయం సమీపంలో ఉన్న గ్రీనరీలో కొంతమంది భవన నిర్మాణదారులు వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా చెత్తాచెదారంతో నిండిపోవడమే కాకుండా కాంక్రీట్ మయంగా తయారవుతున్నది. కొందరు రాత్రి వేళ లారీలు, ట్రాక్టర్లతో డ్రెబిస్ తీసుకువచ్చి వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పచ్చదనం లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే ఈ విషయమై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా శిథిల భవనం



శిథిలావస్థలో ఉన్న వసతి గృహం భవనం

మధురవాడ, జూన్ 12 : జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడ కూడలిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. దీనికి సమీపంలో ఉన్న కొత్త భవనంలో సమీకృత బాలుర వసతిగృహం నిర్వహిస్తున్నారు. పాత భవనాన్ని తొలగించకుండా వదిలేయడం, పిల్లలు అక్కడే ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు ఆడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు



అవంతి క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

భీమునిపట్నం, జూన్ 12 : పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పట్టణ వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందజేశారు. అలాగే నేరెళ్లవలసలోని ఎస్‌వోఎస్ బాలల చిల్డ్రన్స్ విలేజ్‌లో అనాథ బాలలకు రేషన్ సరకులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తఫా, భీమిలి ఏఎంసీ అధ్యక్షుడు యలమంచిలి సూర్యనారాయణ, నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, ఎస్.కరుణాకర్‌రెడ్డి, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు,కోండ్రు రామసూరప్పడు, ఆర్. ప్రభాకర్‌నాయుడు, జగుపిల్లి ప్రసాద్, చిల్ల భాస్కర్‌రెడ్డి, బూర రామకృష్ణ, బూర నాగరాజు, కర్రోతు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, నాయకులు బంగారప్పడు, సత్యనారాయణ, పద్దు, సూరప్పడు, అప్పారావు, ఈశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

ఆరు బయట వంటకాలతో అవస్థలు



దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలంలో వంటలు చేస్తున్న పర్యాటకులు

సింహాచలం, జూన్ 12 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆరుబయట వంటలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. భక్తులు వంటలు చేసుకోవడానికి అటు దేవస్థానం అధికారులు గాని, ఇటు ప్రభుత్వం గాని ఎటువంటి వసతి సౌకర్యం కల్పించడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్నవారు ఆరు బయట వంటకాలు చేసుకుని ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు ప్రస్తుతం బీఆర్‌టీఎస్ కారిడార్ పనుల వల్ల రోడ్డుపై దట్టంగా కమ్ముకుంటున్న దుమ్ము, ధూళి ఎగసిపడి వంటకాల్లో పడుతున్నది. ఒకవైపు దుమ్ము ధూళి, మరోవైపు చెత్త దుర్వాసనతో పర్యాటకులు నరకయాతన పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భక్తుల వంటకాల కోసం వసతి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.